సాక్షి
రంగారెడ్డి

బుధవారం । 5 । మార్చి । 2025




వినియోగించుకోండి

ప్రత్యేక లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు సూచించారు. 8లో▸



సమస్యలపై నిరంతర పోరు

రైతు సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ నిరంతర పోరాడుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. 8లో▸



ఇఫ్తార్	సహర్
బుధవారం సా. 6.30 గం.	గురువారం ఉ. 5.09 గం.

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

గురుకులంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలను మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని భోజనశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని, భోజనశాల నిర్వహణ బాగుందని ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలలో స్టీమ్ కుకింగ్‌కు మరమ్మతులు చేయించాలని, ప్రహరీ నిర్మించాలని తహసీల్దార్ పార్థసారథిని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పట్నం' ఆస్పత్రి సమస్యలు పరిష్కరిస్తాం

వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్



ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో అజయ్‌కుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: వారం రోజుల్లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో కలియతిరిగారు. వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు ఉండేలా చూస్తామన్నారు. సిబ్బంది సైతం అందుబాటులో ఉండేలా చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

శంకర్‌పల్లి: ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిసెంట్ల పనులకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉపాధి హామీ పనులపై 15వ విడత సామాజిక తనిఖీ- ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి గాను మండలంలోని 26 గ్రామాల్లో 4,400 జాబ్ కార్డులు ఉన్నాయని, 387 పనులకు రూ. 2,42,17,421 కోట్లు చెల్లించినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం డీఆర్‌డీఓ శ్రీలత మాట్లాడుతూ.. గ్రామాల్లో రికార్డులు సరిగ్గా నిర్వహించని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకఫీల్డ్ అసిస్టెంట్, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌కి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు రూ. 2వేల జరిమానా విధించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ విధులను పారదర్శకంగా నిర్వర్తించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ సునీత, మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబు, ఏపీడీఓ చరణ్, శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య, ఏపీఓ నాగభూషణం పాల్గొన్నారు.

పోర్టికో కూలిన ఘటనపై విచారణకు ఆదేశం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని నూతన పరిపాలన భవనం పోర్టికో కుప్పకూలిన ఘటనపై విచారణకు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం రాత్రి నోటిఫికేషన్‌ను హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్ విడుదల చేశారు. 8 మందితో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో చైర్మన్‌గా స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ వై.సురేష్, సభ్యులుగా ప్రొఫెసర్ మల్లయ్య, ఎస్.సూర్యప్రకాశ్, బాషా, శివాజీ, రామ్‌శేషు, పి.శ్రీనివాసరావు, జీవీరెడ్డి నియమితులయ్యారు. పోర్టికో కూలిన అంశంపై నిష్పక్షపాతంగా విచారించి సమగ్ర నివేదికను నెల రోజుల్లోగా అందించాలని వైస్ చాన్స్‌లర్ ఆదేశించారు. గత నెల 27న పోర్టికో కుప్పకూలిన ప్రమాదంలో 11 మంది కార్మికులకు గాయాలైన విషయం విదితమే.

నిఘా నీడలో..

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో పరీక్ష కేంద్రాలు : 185
- మొదటి సంవత్సరం విద్యార్థులు : 80,409
- ద్వితీయ సంవత్సరం స్టూడెంట్స్ : 78,395
- మొత్తం హాజరయ్యేవారు : 1,58,804
- సమయం: ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు



కమ్మదనంలోని పరీక్ష కేంద్రంలో బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

షాద్‌నగర్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కీలకమైన ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా ప్రత్యేక స్క్వాడ్ బృందాలను నియమించారు.

ద్వితీయ సంవత్సరం గురువారం నుంచి..

ఈ నెల 22 వరకు పరీక్షలు జరగనున్నాయి. మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి, ద్వితీయ సంవత్సరం గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 185 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. మొదటి సంవత్సరం 80,409 మంది, ద్వితీయ సంవత్సరం 78,395 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పించడంతో పాటు, అన్ని గదుల్లో లైట్లు, ఫ్యాన్లు ఉండేలా, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

పటిష్టమైన పర్యవేక్షణ

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 185 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 185 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 45 మంది కస్టోడియన్ అధికారులు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 10 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. లీకేజీకి ఆస్కారం లేకుండా ఈసారి కొత్తగా ప్రతి ప్రశ్నపత్రంపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రాన్ని స్కాన్ చేస్తే అది ఏ కేంద్రానికి సంబంధించిందో వివరాలు తెలుస్తాయి.

హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్

చాలా మంది విద్యార్థులు పరీక్ష కేంద్రం ఎక్కడుందో తెలుసుకునేందుకు నానా ఇబ్బందులు పడుతుంటారు.దీన్ని గుర్తించిన ఇంటర్ బోర్డు హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించింది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రం చిరునామాతో పాటు ఫొటోలు కనిపిస్తాయి. గూగుల్ మ్యాప్‌తో అనుసంధానమై ఉండటంతో ఉన్నచోట నుంచే ఎంతసమయంలో పరీక్ష కేంద్రానికి చేరుకోగలరో తెలుస్తుంది.

సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ

ప్రశ్నపత్రాల పంపిణీ నుంచి విద్యార్థుల దగ్గర సమాధాన పత్రాలు తీసుకునే వరకు ప్రతి అంశాన్ని సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నారు. కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయానికి అనుసంధానించే ఈ కెమెరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలను మూసివేయనున్నారు.

మౌలిక సదుపాయాలు

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. తాగునీటి వసతితో పాటు అత్యవసర వైద్య సాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎండల నేపథ్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.

పకడ్బందీ చర్యలు

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. చేతి గడియారాలకు అనుమతి ఉండదు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాం.

– వెంక్యా నాయక్, డీఐఈవో



నక్కర్తమేడిపల్లిలో రేకుల ఇంటిని పరిశీలిస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

స్థానిక సమస్యలపై పోరుబాట

- ఫార్మా భూ బాధితులకు అండగా ఉంటాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

యాచారం: స్థానిక సమస్యలపై సీపీఎం పోరుబాటకు సిద్ధమైందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోనే మొదటిసారి యాచారం మండలం నక్కర్తమేడిపల్లిలో మంగళవారం పర్యటించారు. పలు కాలనీల్లో తిరుగుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. గ్రామాల్లో పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని, పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని తెలిపారు. ఫార్మాసిటీ పేరుతో గత బీఆర్‌ఎస్ సర్కార్ ఆయా గ్రామాల్లో 9 వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూములు సేకరించిందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ రద్దు చేసి రైతులకు అండగా ఉంటామని చెప్పారని గుర్తు చేశారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తామని చెప్పడం న్యాయం కాదన్నారు. గత ప్రభుత్వం లానే రేవంత్‌రెడ్డి సర్కార్ కూడా రైతుల భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన పట్టా భూముల రికార్డులను తిరిగి రైతుల పేర్లపై మార్చాలని హైకోర్టు ఆదేశించినా అధికారుల్లో చలనం లేదని విమర్శించారు. ఫార్మాసిటీని రద్దు చేశారా.. ఫ్యూచర్‌సిటీని ఏ విధంగా నిర్మిస్తున్నారో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా భూ బాధితులకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, జిల్లా కమిటీ సభ్యుడు పి.అంజయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

విజన్ లేని ముఖ్యమంత్రి పాలన

- మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ లేకుండా పాలిస్తున్నారని, పది రూపాయల పనికి వందసార్లు ప్రభుత్వాన్ని అడగాల్సిన దుస్థితి ఏర్పడిందని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్‌లో మంగళవారం ఆమె పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, అధికారులను బాధ్యతగా పనిచేయించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడాలని.. తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎన్నికలప్పుడు మాట్లాడినట్లే మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలపై దృష్టి పడితే బాగుంటుందని హితవు పలికారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ, శానిటేషన్ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు లోకసాని కొండల్‌రెడ్డి, దర్పల్లి అశోక్, సుశీలరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహ్మద్ ఇస్మాయిల్, సాలమ్మ, శృతి, సునీల్‌యాదవ్, ఆకుల అరుణ్, రాజు యాదవ్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోరెంకల నర్సింహ

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలని మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండల కమిటీ సమావేశం మంగళవారం సంఘం మండల అధ్యక్షుడు రవణమోని రాజు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోరెంకల నర్సింహ మాట్లాడుతూ.. మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. జల వనరుల్లో ఉన్న మత్స్య సంపద ప్రకృతి వైపరీత్యాలు, కాలుష్యంతో చనిపోతే ఎలాంటి నష్టపరిహారం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని ప్రభుత్వం బోర్లు వేయించి మత్స్యకారుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చెనమోని శంకర్ మాట్లాడుతూ.. మత్స్యకార సొసైటీల బాగోగులు చూడడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాని విమర్శించారు. కార్యక్రమంలో రాయపోల్ సొసైటీ అధ్యక్షుడు మైలారం యాదయ్య, అంకర్ల రమేష్, శేరిగూడ సొసైటీ కార్యదర్శి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

భారతదేశం ఔషధ మొక్కలకు పుట్టినిల్లు

కడ్తాల్: అనాది నుంచి భారతదేశం ఔషధ మొక్కలకు పుట్టినిల్లు అని బెంగళూరుకు చెందిన ఆయుర్వేద చికిత్స నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్ శర్మ పేర్కొన్నారు. అన్మాస్‌పల్లి పంచాయతీ పరిధిలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి ఒడిలో ఒక రోజు పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రావిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు పర్యావరణ వేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ శర్మ మాట్లాడుతూ.. ఔషధ మొక్కల ఔన్నత్యాన్ని, ప్రాముఖ్యతను గుర్తించి జీవన గమనంలో భాగం చేసుకోవాలని సూచించారు. సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో ఔషధ మొక్కలు పెంచుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకుడు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్, జగదీశ్, సీజీఆర్ ప్రతినిధులు జ్ఞానేశ్వర్, నాగేశ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్ శర్మ

తక్కువ ధరకు ఇంటర్నెట్ సేవలు

- సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి

షాద్‌నగర్: పల్లెల్లో ప్రజలకు తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పరిధిలోని హాజిపల్లి గ్రామంలో టీ ఫైబర్ ద్వారా అందిస్తున్న ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలను ఆయన ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. పల్లెల్లో ప్రజలకు ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఇంటర్నెట్ కీలకంగా మారిందన్నారు. ప్రతి పని, సేవలకు తోడు టీవీ, సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం ఇంటర్నెట్‌తోనే ముడిపడి ఉన్నాయన్నారు. ప్రభుత్వం తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతి ఇంటితోపాటు కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు టీ ఫైబర్ నెట్ ద్వారా సులభం అవుతాయన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా హాజిపల్లిలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని, త్వరలో అన్ని గ్రామాల్లో సేవలను విస్తరించనున్నట్లు వివరించారు. అనంతరం గ్రామంలోని ఇంటర్నెట్ ఉన్న ఇళ్లకు, పూరి గుడిసెల్లోకి వెళ్లి వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీఫైబర్ ఎండీ ప్రవీణ్, డీపీఓ సురేష్‌మోహన్, ఆర్డీఓ సరిత, తహసీల్దార్ పార్థసారథి, ఎంఈఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్నెట్ సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి

పసికందును ఇవ్వాలంటే పైసలివ్వాల్సిందే ..

- ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది డిమాండ్
- బాధితుడి ఫిర్యాదుతో అప్పగింత



బాధితుడు అశోక్

షాద్‌నగర్: అప్పుడే పుట్టిన పసికందును కుటుంబ సభ్యులకు అందజేసేందుకు ఆస్పత్రి సిబ్బంది డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన ఘటన షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన బోడ అశోక్ తన భార్య స్రవంతికి పురిటి నొప్పులు రావడంతో మంగళవారం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేయడంతో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అంతలోనే ప్రసూతి నిమిత్తం ఆపరేషన్ చేసినందుకు, పసికందును ఇచ్చేందుకు రూ.1,500 ఇవ్వాలని సిబ్బంది డిమాండ్ చేశా రు. తన వద్ద రూ.వెయ్యి మాత్రమే ఉన్నాయని చెప్పినా వదల్లేదు. చేసేదిలేక న్యాయం చేయాలని, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అశోక్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశాడు. సూపరింటెండెంట్ సిబ్బందిపై సీరియస్ అవడంతో బిడ్డను అందజేశారు.

కీసరగుట్ట హుండీ లెక్కింపు

కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రూ.92,49,961 ఆదాయం సమకూరింది. ప్రసాదాలు, వివిధ ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాల టికెట్ల విక్రయం ద్వారా రూ.63,51,060 ఆదాయం రాగా, హుండీ ఆదాయం రూ.28,98,901 వచ్చిందని, ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈవో సుధాకర్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం దేవాలయం మహామండపంలో హుండీని లెక్కించారు.

హాల్‌టికెట్ కోసం విద్యార్థి ఆందోళన

- పూర్తి ఫీజు చెల్లించకపోవడంతో యాజమాన్యం నిరాకరణ
- విషయం వైరల్ కావడంతో ఇచ్చేసిన వైనం



కళాశాల ఎదుట బైఠాయించిన విద్యార్థి వెంకట పవన్

మీర్‌పేట: ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం అవుతుండగా పరీక్షకు సిద్ధం కావాల్సిన ఓ విద్యార్థి హాల్‌టికెట్ ఇవ్వాలని కళాశాల ఎదుట బైఠాయించాడు. ఈ సంఘటన మీర్‌పేట పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ.. మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన వెంకట పవన్ బాలాపూర్ చౌరస్తాలోని శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పూర్తి ఫీజు చెల్లించలేకపోయాడు. దీంతో కళాశాల యాజమాన్యం హాల్‌టికెట్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ క్రమంలో వెంకట పవన్ మంగళవారం రూ.5వేలు చెల్లించాడు. పూర్తి ఫీజు చెల్లిస్తే గానీ హాల్‌టికెట్ ఇచ్చేది లేదని తెగేసి చెప్పింది. దీంతో పవన్ కళాశాల ఎదుటే కూర్చొని హాల్‌టికెట్ ఇవ్వాలని వేడుకున్నాడు. విషయం కాస్తా స్థానికంగా వైరల్ కావడంతో యాజమాన్యం రూ.5వేలు తిరిగిచ్చేయడంతో పాటు హాల్‌టికెట్ అందజేసింది.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని ఏసీపీ రంగస్వామి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్‌లో గ్రామస్తులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. ఏదైనా ఘటన చోటు చేసుకుంటే నేరస్తులను గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. గ్రామస్తులు ఐక్యంగా ఉండి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని, గ్రామంలో మద్యపాన నిషేధం కొనసాగడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభించిన ఏసీపీ రంగస్వామి

పుష్కరిణిలో మునిగి వ్యక్తి మృతి

- స్నానం చేసే క్రమంలో ప్రమాదం
- మృతుడు గోనూరువాసి

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ జాతరకు వచ్చిన ఓ భక్తుడు స్నానం చేసేందుకు పుష్కరిణిలో దిగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గోనూరుకు చెందిన కురువ బిచ్చప్ప(45) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బతుకుదెరువు కోసం నాలుగేళ్ల క్రితం భార్య శివలీల, కూతురుతో కలిసి అత్తగారి గ్రామమైన చేవెళ్ల మండలం కిష్టాపూర్ వచ్చాడు. ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం చేవెళ్లలో జరుగుతున్న జాతరకు వెళ్దామని భార్యతో అన్నాడు. సాయంత్రం వెళ్దామని చెప్పిన ఆమె.. కూలీ పనికి వెళ్లింది. దీంతో బిచ్చప్ప ఒక్కడే చేవెళ్లకు చేరుకున్నాడు. స్నానం చేసేందుకు ఆలయ సమీపంలోని పుష్కరిణిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారడంతో ఈత రాక నీటిలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న పలువురు భక్తులు ఇది గమనించి బయటకు తీయగా, అప్పటికే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శివలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



బిచ్చప్ప మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



రాకేశ్ మృతదేహం

కందుకూరు: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాలు. మండల పరిధిలోని పులిమామిడికి చెందిన రేవెళ్ల ఏసయ్య కుమారుడు రాకేశ్(23) హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తాను ప్రేమించిన యువతి నిరాకరించిందనే మనస్తాపంతో మంగళవారం ఉదయం ఇంట్లోని పైకప్పు కొండీలకు లుంగీతో ఉరేసుకున్నాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కీచక తండ్రికి ఏడేళ్ల జైలు

శంకర్‌పల్లి: కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్న తండ్రి కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ ఎల్బీనగర్ స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి తీర్పు వెల్లడించారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన విస్లావత్ రామునాయక్(43) మద్యానికి బానిసయ్యాడు. 2018లో తన సొంత కూతురైన బాలిక(13)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పూర్తి వాదనలు విన్న జడ్జి పద్మావతి.. నిందితుడికి పైశిక్షలు విధిస్తూ తీర్పు చెప్పారు.

గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలిన సిలిండర్

ఒకరికి తీవ్ర గాయాలు

మూసాపేట: అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా సిలిండర్ పేలడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా పరిసర ప్రాంతవాసులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లి బాగ్అమీర్ కాలనీలో హరి శంకర్ త్యాగి అనే వ్యక్తి ఎలక్ట్రికల్ అండ్ గ్యాస్ సర్వీస్ షాపును నిర్వహిస్తున్నాడు. మంగళవారం షాపులో పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌లోకి గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. షట్టర్ పైభాగం రేకులు, షట్టర్‌లు ఎగిరి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. షాపు పూర్తిగా ధ్వంసమైంది. రీఫిల్లింగ్ చేస్తున్న హరి శంకర్‌కు కాళ్లు, చేతులు కాలిపోయాయి. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జనావాసాల మధ్య అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నందుకు అతనిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

గోడకు కన్నం వేసి వైన్స్‌లో చోరీ

- రూ.50 వేల అపహరణ
- నాగర్‌గూడలో ఘటన



దుండగులు పగలగొట్టిన వైన్స్ గోడ

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు ఓ వైన్ షాపు గోడను పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మూడేళ్లుగా మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన కప్ప హరిబాబు నాగర్‌గూడ దుర్గా వైన్స్‌లో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి వైన్ షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం 10:30కి వచ్చి షాపు తెరిచి చూసే సరికి చిందరవందరగా ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ.50 వేల నగదు, సీసీ కెమెరా డివైజ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. షాపు వెనుక నుంచి వెళ్లి రెండు ఫీట్ల గోడను పగలగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. హరిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

శంషాబాద్: ఆర్టిఫిషియల్ లింబ్ మనుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో వయోవృద్ధులు, దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయనున్నట్లు మహేశ్వరం సీడీపీఓ శాంతిశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ పట్టణంలోని మహిళామండలి భవనంలో గురువారం ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. దివ్యాంగులు వికలాంగుల ధ్రువీకరణ పత్రం (కనీసం 40శాతం) ఉండాలన్నారు. దాంతో పాటు ఆదాయ ధ్రువీకరణ లేదా బీపీఎల్ కార్డుతో పాటు ప్రతి లబ్ధిదారులు ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

శంషాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అసైన్డు భూముల్లోని అక్రమ నిర్మాణాలును రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. పట్టణ పరిధిలోని గొల్లపల్లి కుర్దు సర్వే నంబరు 210, 220, 221లో అసైన్డు భూములో ఇటీవల గృహ నిర్మాణాలు చేపట్టి వాటికి ఇంటి నెంబర్లు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసి విక్రయిస్తున్న తీరుపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయమై తహసీల్దార్ రవీందర్‌దత్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్ఐ కృష్ణ తదితర సిబ్బంది అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. అసైన్డు భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరించారు.

గూగుల్‌ను వాడి.. గుడులలో దోపిడీ!

శివారు ప్రాంతాల్లోని ఆలయాలే టార్గెట్

- బంగారు, వెండి ఆభరణాల అపహరణ
- దొంగిలించిన సొత్తుతో జల్సాలు
- అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు చిక్కిన దుండగులు
- 20 కిలోల వెండి బిస్కెట్లు స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్: చోరీలు పాల్పడేందుకు సాంకేతికతను ఎంచుకున్నారీ దుండగులు. గ్రామ శివారుల్లో ఉండే దేవాలయాలనే లక్ష్యంగా చేసుకున్నారు. గూగుల్‌మ్యాప్‌లో అప్‌లోడ్ చేసే దేవతా మూర్తులకు అలంకరించిన బంగారు, వెండి ఆభరణాలను అపహరించేందుకు పక్కా ప్రణాళికతో తెగబడ్డారు. నగర శివారులోని ఘట్‌కేసర్, దుండిగల్, బీబీనగర్, ఇబ్రహీంపట్నం, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లోని దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు దుండగులు ఎట్టకేలకు వాహన తనిఖీ చేపడుతున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు చిక్కారు. సీఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున వాహన తనిఖీ చేపడుతున్న పోలీసులకు ఓ ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తుల తీరు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని బ్యాగును తనిఖీ చేయగా అందులో బిస్కెట్ల రూపంలో ఉన్న 20 కిలోల వెండి కనిపించింది. దుండగులిద్దరినీ స్టేషన్‌కు తీసుకుని విచారించగా మేడ్చల్‌లోని పోలీస్ క్వార్టర్స్ వెనకాల నివసించే మహ్మద్ ఇంతియాజ్ షరీఫ్, మెదక్ జిల్లా శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన రంగా వేణులుగా గుర్తించారు. ఇద్దరు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి ఎలాగైనా అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దేవాలయల్లో దొంగతనాలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. అందుకు గూగుల్‌మ్యాప్‌ను వినియోగించుకున్నారు.



నిందితులు ఇంతియాజ్ షరీఫ్, వేణు

విజయవాడలో విక్రయించి

నివాస గృహాలకు దూరంగా, గ్రామ శివారుల్లో ఉండే ఆలయాలను టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతూ బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకు పోయారు. వాటిని కరిగించి బిస్కెట్ల రూపంలో విజయవాడలో విక్రయించి సొమ్ము చేసుకుంటూ జల్సాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఇటీవల మండలంలోని పిగ్లీపూర్ గ్రామంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో దొంగతనం చేసిన వెండి ఆభరణాలను కరిగించి బిస్కెట్లుగా మార్చి విజయవాడలో విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులకు చిక్కారు. పిగ్లీపూర్‌తో పాటు ఘట్‌కేసర్, దుండిగల్, బీబీనగర్, ఇబ్రహీంపట్నం, జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లోని దేవాలయాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరు దుండగుల నుంచి 20 కిలోల వెండి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రైతు సమస్యలపై నిరంతర పోరు

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

మొయినాబాద్: రైతు సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో మంగళవారం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నలభై ఏళ్లుగా భారతీయ కిసాన్ సంఘ్ రైతుల సమస్యలపై పోరాటం చేస్తూ అనేక సమస్యలు పరిష్కరించిందన్నారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను మోసం చేస్తుందన్నారు. అరకొరగా కొంత మంది రైతులకే రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చిందన్నారు. అందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకర్, సుధాకర్‌రెడ్డి, నాయకులు భూపాల్‌రెడ్డి, బసవరాజు, వెంకట్‌రెడ్డి, నారాయణ, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి, కాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్

2.5 తులాల బంగారం, 1.5 తులాల వెండి స్వాధీనం

పరిగి: దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించిన ఘటన పరిగి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 1న పట్టణ కేంద్రంలోని ఎన్‌టీఆర్‌నగర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి సయ్యాద్ ఫెరోజ్ ఇంట్లో దొంగతనం చేసి పారి పోతుండగా కుటుంబసభ్యులు పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో దొంగ వారిని కొట్టి పరారయ్యాడు. దీంతో బాధితులు అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మంగళవారం పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న వ్యక్తిని పట్టుకొని విచారించారు. అతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సంతనూతలపాడు గ్రామానికి చెందిన తన్నీరు శ్రీనుగా గుర్తించారు. ఇతడు కరీంనగర్ జిల్లాలో పలు చోరీలు పాల్పడగా అక్కడి పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకి పంపించారు. 2023లో జైలు నుంచి వచ్చి మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. సుల్తాన్‌పూర్‌లో బంగారు ఆభరణాలు చోరీలకు పాల్పడ్గా షాద్‌నగర్ పట్టణంలో నగదు దొంగతనం, ఎన్‌టీఆర్‌నగర్‌లో ఈ నెల 1న దొంగనానికి పాల్పడినట్లు తేలింది. అతని నుంచి 2.5 తులాల బంగారం, 1.5 తులాల వెండి, రూ.2,000 నగదును స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కడ్తాల్: నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్)తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను వెతికి పట్టుకుని సీఐ శివప్రసాద్ బాధితులకు అందజేశారు. మండల పరిధిలోని గోవిందాయిపల్లికి చెందిన జంగయ్య, ఎక్వాయిపల్లికి చెందిన నర్సింహగౌడ్, తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన హరికృష్ణ, కందుకూర్‌కు చెందిన సాయికుమార్‌లు ఇటీవల వేర్వేరు చోట్ల తమ సెల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ఉపయోగించి సెల్‌ఫోన్లను వెతికి పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు అప్పగించారు. ఎవరైనా సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడంతో తిరిగి పొందే అవకాశం ఉంటుందని సీఐ తెలిపారు.



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ శివప్రసాద్

‘మల్టీలెవెల్ పార్కింగ్’ పనులు చకచకా

- కేబీఆర్ పార్క్ వద్ద ఆరు అంతస్తుల్లో నిర్మాణం
- 72 కార్లు పార్కింగ్ చేసుకునే అవకాశం



కేబీఆర్ పార్కు పక్కన మల్టీ పార్కింగ్ లెవెల్ నమూనా

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు సమీపంలో పార్కింగ్ సమస్యను నివారించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పార్కు పక్కనే ఉన్న జీహెచ్ఎంసి స్థలంలో ఈ నిర్మాణం గత రెండు వారాల నుంచి ముమ్మరంగా జరుగుతున్నది. ఆరు అంతస్తులలో నిర్మాణం జరుగుతున్న ఈ మల్టీ లెవెల్ పార్కింగ్‌లో ఒక్కో ఫ్లోర్‌లో 12 కార్లు పార్కింగ్ చేయవచ్చు. ఇలా మొత్తం ఆరు ఫ్లోర్లలో 72 కార్లు పార్కు చేసుకునే అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌కు చెందిన నవనిర్మాణ ఏజెన్సీ ఈ పనులు చేస్తున్నది. రూ.రెండున్నర కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పార్కింగ్ నిర్మాణంలో హైడ్రాలిక్ పద్ధతిలో లిఫ్ట్ సౌకర్యం ఉంటుంది. పార్కింగ్ కోసం కారు రాగానే ఈ హైడ్రాలిక్ లిఫ్ట్‌లో ఏ ఫ్లోర్లో ఖాళీగా ఉంటే ఆ ఫ్లోర్ లోకి కారు తీసుకెళ్లి పార్కింగ్ చేస్తారు. కారు పార్కింగ్ చేసిన తర్వాత ఒక చిప్‌ను కారు యజమానికి ఇస్తారు. వాకర్లు, ఇతర పనుల కోసం వచ్చిన వారు తమ కార్లు పార్క్ చేసిన తర్వాత..పని పూర్తికాగానే వెళ్తే డ్రైవర్ కారును కిందికి తెప్పిస్తాడు. ప్రస్తుతం ఇలాంటి మల్టీ లెవెల్ పార్కింగ్ వ్యవస్థ బెంగళూరు, చెన్నైలో మాత్రమే ఉంది. హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా కేబీఆర్ పార్కు పక్కన నిర్మిస్తున్నారు. దీని చుట్టూ కేఫెలు, ఇతర దుకాణాలు కూడా ఏర్పాటు చేస్తారు. పార్కింగ్ ప్రాంతం అంతా సుందరంగా తీర్చిదిద్దుతారు. ఇప్పటికే ఫుట్‌పాత్‌పై ఉన్న బస్సు షెల్టర్లను నోటీసులు అందజేసి తొలగించారు. ఇక్కడ కొనసాగుతున్న కడక్ చాయ్‌తో పాటు 1980 మిలిటరీ హోటల్ కూడా తొలగించనున్నారు. ఈ రెండు దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. ఇక్కడ మల్టీ లెవెల్ పార్కింగ్ వ్యవస్థ నిర్మాణం పూర్తయిన తర్వాత పరిసరాలన్నీ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు.

సైబర్ నేరాలపై స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాలపై సైబరాబాద్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నారు. గత రెండు నెలల్లో 82 కేసులను దర్యాప్తు చేసిన పోలీసులు..11 రాష్ట్రాల్లోని 161 మంది అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. ఇందులో అత్యధికంగా 37 ట్రేడ్ ఫ్రాడ్ కేసుల్లో 82 మంది నేరస్తులు ఉన్నారని అధికారులు తెలిపారు. అలాగే 11 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న సూరత్‌కు చెందిన నలుగురు పాత నేరస్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ట్రేడింగ్, పార్ట్ టైం జాబ్స్ సామాన్యులను నిలువెల్లా మోసం చేస్తున్న అజయ్ ఆనంద్ భాయ్ ఇటాలియా, జల్పేష్, విశాల్ అరివాద్ తుమ్మర్, హిరేన్ కుమార్ ప్రవీణ్ భాయ్‌లను పట్టుకున్నారు. అలాగే 15 డిజిటల్ అరెస్టు కేసుల్లో 27 మందిని, 12 పార్ట్ టైం జాబ్ ఫ్రాడ్స్‌లలో 26 మందిని, ఐదు అడ్వర్టయిజ్‌మెంట్ మోసాల్లో 8 మందిని అరెస్టు చేశామని అధికారులు తెలిపారు.

ఎర్రమట్టి తరలిస్తున్న ఏడుగురి బైండోవర్

నవాబుపేట: అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో నుంచి ఎర్ర మట్టి తరలిస్తున్న ఏడుగురిని మంగళవారం తహసీల్దార్ జైరాం ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు. వీరిలో గెరిగెట్‌పల్లికి చెందిన పట్నం ప్రవీణ్‌కుమార్, కేశవపల్లికి చెందిన గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్, అక్కనోళ్ల నర్సింహారెడ్డి, ఆర్కతలకు చెందిన కుమ్మరి అంజనేయులు, బూరగోని రాంచందర్, గుండాల మధుసూదన్‌రెడ్డి, గుండాల విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నట్లు తెలిపారు. అక్రమంగా మట్టి, ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

రిటైర్డ్ జడ్జి సాంబశివరావు



కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డ్ జడ్జి సాంబశివరావు, సీఐ వెంకటేశం

చేవెళ్ల: పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కొనసాగుతున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు సూచించారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు కేసులపై ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి సాంబశివరావు పలు కేసులను పరిష్కరించి వాటికి జరిమానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీ నుంచి 8 వరకు ప్రత్యేక లోక్ అదాలత్ కొనసాగుతుందన్నారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసులలో మద్యం తాగి వాహనాలు నడపడం, లైసెన్స్‌లు లేకుండా నడపడం తదితర వాటిని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో మద్యం తాగి వాహనాలు నడిపించిన 71 కేసులు పరిష్కరించి రూ.1,86,500 జరిమానాలు విధించినట్లు చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా నమోదైన 63 కేసులను పరిష్కరించి రూ.83,500 జరిమానాల రూపంలో వచ్చాయన్నారు. శనివారం వరకు ఈ లోక్‌అదాలత్ కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేపాల్‌లో ఆ ఇద్దరు నేరగాళ్లు!

- జనవరిలో బీదర్, అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు
- చెన్నై మీదుగా పశ్చిమ బెంగాల్‌కు బిహారీలు

సాక్షి, సిటీబ్యూరో: కర్నాటకలోని బీదర్, నగరంలోని అఫ్జల్‌గంజ్‌లో తుపాకులతో విరుచుకుపడిన ఇద్దరు దుండగులు అమన్ కుమార్, అలోక్ కుమార్ దేశ సరిహద్దులు దాటి నేపాల్ పారిపోయినట్లు నగర పోలీసులు గుర్తించారు. ఈ ఏడాది జనవరి 16 ఈ రెండు నేరాలకు పాల్పడిన బీహారీ ద్వయం పశ్చిమ బెంగాల్ మీదుగా నేపాల్ వెళ్లినట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. నేరచరితులైన వీళ్లు గతంలోనూ ఇలా దేశం దాటి, పోలీసుల హడావుడి తగ్గిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చారని అధికారులు చెప్తున్నారు.

మీర్జాపూర్ నుంచి మారణకాండ...

బిహార్‌లోని వైశాలి జిల్లా ఫతేపూర్ పుల్వారియాకు చెందిన అమన్ కుమార్, అలోక్ కుమార్, చందన్ కుమార్, రాజీవ్ సాహ్నిలతో ఈ ముఠా ఏర్పడింది. వాహనాలపై తిరుగుతూ, పట్టణ శివార్లలో రెక్కీ చేసి, ఏటీఎం మిషన్లలో నగదు నింపే వాహనాలనే టార్గెట్‌గా చేసుకోవడం వీరి నైజం. అలోక్ కుమార్ నేతృత్వంలో సాగే ఈ ముఠా 2023 సెప్టెంబర్ 12న ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లో పంజా విసిరింది. సెక్యూరిటీ గార్డు జై సింగ్‌ను హత్య చేసి రూ.40 లక్షలు దోచుకుపోయింది. యూపీ పోలీసులు దాదాపు ఏడాది పాటు గాలించి గత ఏడాది సెప్టెంబర్‌లో చందన్ కుమార్‌ను ముంబైలో, రాజీవ్ సాహ్నిని వైశాలిలో పట్టుకున్నారు. అప్పట్లో అమన్, అలోక్‌లు వైశాలి జిల్లాలోని మహిసార్ జనధన్ వద్ద ఉన్నట్లు గుర్తించారు.

బిహార్‌లోనూ అనేక నేరాలు చేసి...

యూపీ పోలీసుల హడావుడి తగ్గిన తర్వాత ఈ ద్వయం నేపాల్ నుంచి బీహార్ చేరుకుంది. అప్పటికే తమ వద్ద ఉన్న డబ్బు అయిపోవడంతో మళ్లీ నేరాలు మొదలెట్టింది. ఈ ఏడాది జనవరిలో నగరానికి వచ్చి, షెల్టర్ తీసుకుంది. అదే నెల 16న బీదర్‌లో పంజా విసిరింది. ఏటీఎం మిషన్లలో నగదు నింపే సీఎంఎస్ సంస్థ ఉద్యోగిని గిరి వెంకటేష్‌ను చంపి, శివకుమార్‌ను గాయపరిచి రూ.83 లక్షలతో ఉడాయించింది. నగరంలో షెల్టర్ తీసుకున్న అమన్, అలోక్ నగదుతో తిరిగి ఇక్కడికే వచ్చి నేరానికి వాడిన ద్విచక్ర వాహనాన్ని ఎంజీబీఎస్ పార్కింగ్‌లో ఉంచారు. అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ నుంచి ప్రైవేట్ బస్సులో రాయ్‌పూర్ వెళ్లేందుకు అమిత్‌కుమార్ పేరుతో టిక్కెట్ బుక్ చేసుకుంది. అక్కడ మేనేజర్ జహంగీర్‌ను కాల్చడం, పారిపోవడం జరిగిపోయాయి.

ఆధారాలు దొరక్కుండా ప్రయాణాలు...

అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లిన వీళ్లు... అక్కడ నుంచి గజ్వేల్ వెళ్లడానికి మరో ఆటో మాట్లాడుకున్నారు. అనివార్య కారణాలతో తిరుమలగిరిలో దిగేసి... ఇంకో ఆటోలో మియాపూర్ వెళ్లారు. ఆపై తిరుపతి వెళ్లే ఆర్టీసీ ఎక్కి కడపలో దిగిపోయారు. మరో బస్సులో నెల్లూరు, అట్నుంచి చెన్నై వెళ్లారు. చెన్నై నుంచి రైలులో కోల్‌కతా చేరుకొని సిలిగురి నుంచి నేపాల్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై ఇప్పటికే యూపీ పోలీసులు రూ.2 లక్షలు, కర్ణాటక పోలీసులు రూ.5 లక్షలు రివార్డు ప్రకటించారు.